

బక్క రవీందర్
ఎడిటర్
సెల్: 8501919707

తెలుగు దినపత్రిక

# డైలీ రిపోర్ట్

DAILY REPORT








సంపుటి: 1 సంచిక: 140 పేజీలు: 4 ఎడిటర్ : బక్క రవీందర్ ప్రచురణ: హైదరాబాద్ మంగళవారం 24-12-2024 వెల: 5/రూ -


## పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం

మలేషియా వ్యాపారవేత్తలతో మంత్రి శ్రీధర్‌బాబు



2లో



2లో


## గత ఏడాదిన్నరలో.. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం

వీరిలో అత్యధిక మంది మహిళలే.. ఇదో రికార్డు: ప్రధాని మోదీ


ఢిల్లీ రోజ్‌గార్ మేళాలో 71 వేల మందికి నియామక పత్రాలు

## దిగంతాలకు సమాంతర సినీమాంత్రికుడు..

### దర్శక దిగ్గజం శ్యామ్ బెనెగల్ కన్నుమూత



- కిడ్నీ సంబంధిత వ్యాధితో ముంబైలో తుదిశ్వాస
- హైదరాబాద్‌లో జననం
- భారతీయ సినిమాకు ప్రపంచ ఖ్యాతి తీసుకొచ్చిన దర్శకుడు
- పద్మభూషణ్, ఫాల్కే అవార్డులతో గౌరవించిన కేంద్ర ప్రభుత్వం
- తెలుగు చిత్రం అనుగ్రహంకు దర్శకత్వం



# నో డిటెన్షన్ విధానం రద్దు

### 5, 8 తరగతులకు ఉత్తీర్ణత తప్పనిసరి..ఫెయిలైతే 2 నెలల్లో మరోసారి పరీక్షలు

- ఆ పరీక్షల్లో పాస్ అయితేనే పై తరగతులకు.. లేదంటే, అదే తరగతి మళ్లీ చదవాల్సిందే
- కేంద్రం కీలక నిర్ణయం.. గెజిట్ విడుదల
- కేంద్రం పరిధిలోని 3 వేల బడుల్లో అమలు
- ఇప్పటికే 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేసిన 16 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాలు
- తెలుగు రాష్ట్రాల్లో కొనసాగుతున్న 'నో డిటెన్షన్'

హైదరాబాద్: పాఠశాల విద్యకు సంబంధించి కేంద్రప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొన్నది. 'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది. దీంతో 5, 8 తరగతుల వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించని విద్యార్థులు పై తరగతులకు ప్రమోట్ కారని, ఫెయిలైనట్లేనని వెల్లడించింది. ఈ మేరకు సోమవారం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. 5, 8 తరగతులు చదివే విద్యార్థులు పై తరగతులకు వెళ్లాలంటే ఏడాది చివర్లో నిర్వహించే వార్షిక పరీక్షల్లో ఇకపై తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సిందే.ఒకవేళ విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించకపోతే.. ఫలితాలు

2లో

- యాసంగి నుంచి రైతు భరోసా అమలుకు సర్కారు నిర్ణయం
- యాంత్రీకరణ పథకంతో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు
- కొత్త రేషన్ కార్డుల పంపిణీ కూడా సంక్రాంతి నుంచే
- 30న మంత్రివర్గ సమావేశం.. కీలక నిర్ణయాలకు ఆమోదం!
- గడిచిన ఏడాదిలో రుణమాఫీకి ప్రాధాన్యమిచ్చిన ప్రభుత్వం

# సంక్రాంతికి వస్తున్నాం!

### రైతుల ముంగిట్లోకి రెండు వ్యవసాయ సంక్షేమ పథకాలు



హైదరాబాద్: తొలి ఏడాది పాలనలో రుణమాఫీ పథకం అమలుకు పూర్తి ప్రాధాన్యమిచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం.. రెండో సంవత్సరంలో రైతులకు సంబంధించిన ఇతర వ్యవసాయ సంక్షేమ పథకాల అమలుపై ప్రత్యేక దృష్టి సారించింది. సంక్రాంతి పండుగకు రైతు భరోసా, యాంత్రీకరణ పథకాలను రైతుల ముంగిట్లోకి తీసుకొస్తోంది. రేషన్ కార్డులు లేనివారికి కొత్త కార్డులు పంపిణీ చేసే పథకాన్ని కూడా సంక్రాంతి నుంచే అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. ఈ నెల 30న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ భేటీలో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు.

2లో

# ఉరికొయ్యలు.. చెరసాలలు!

- ఇందిరమ్మ రాజ్యంలో రైతులకు మిగిలిందివే!
- కాంగ్రెస్ పాలనలో అన్నదాతల ఆక్రందనలు
- ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనకుండా అరిగోస పెడుతున్న సర్కార్
- బోనస్ దేవుడెరుగు.. ధాన్యం కొనే దిక్కేలేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో





# అందాల దీవిలో కడలి కల్లోలం

- చిన్నగొల్లపాలెం కొబ్బరి తోటలను మింగేస్తున్న కడలి తరంగాలు
- తుపాను వచ్చిందంటే గ్రామస్తులకు హడలే
- ఇప్పటికే సముద్రంలో కలిసిపోయిన 800కు పైగా ఎకరాలు
- కొత్త ప్రదేశంలో రాతి కట్టడం నిర్మించాలంటున్న ప్రజలు

# విచారణకు రండి..

### ఉదయం 11 గంటలకు రావాలని అల్లు అర్జున్‌కు పోలీసుల నోటీసు



- నేటి నుంచి రోజువారీ విచారణ?
- బడ్జెట్ పెరిగితే టికెట్ రేట్లు పెంచాలి
- సీఎంను కలిసే అంశంపై దిల్ రాజు
- వచ్చాక నిర్ణయం: నిర్మాత నాగవంశీ
- ధరల పెంపు మధ్యతరగతికి భారం
- ప్రభుత్వం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం
- ఏపీ ప్రభుత్వమూ ఇలాగే చెయ్యాలి
- ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ ప్రకటన
- శ్రీతేజ్‌కు 'పుష్ప' నిర్మాతల పరామర్శ
- కోమటిరెడ్డితో కలిసి ఆస్పత్రికి వెళ్లి అతడి తండ్రికి రూ.50 లక్షల చెక్

హైదరాబాద్ మధ్యంతర బెయిల్‌పై ఉన్న నటుడు అల్లు అర్జున్‌కు చిక్కడపల్లి పోలీసులు నోటీసులు జారీ చేశారు. సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనపై మరింత లోతైన దర్యాప్తు చేసేందుకు మంగళవారం ఉదయం 11 గంటలకు హాజరు కావాల్సిందిగా ఆ నోటీసులో పేర్కొన్నారు. తొక్కిసలాటలో రేవతి అనే మహిళ చనిపోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సంగతి తెలిసిందే. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు 18 మంది మీద కేసులు నమోదు చేశారు. అల్లు అర్జున్‌ను 11వ నిందితుడిగా చేర్చారు. అయన్ను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయస్థానం రిమాండు విధించింది. అల్లు అర్జున్ దీనిపై హైకోర్టును ఆశ్రయించగా రూ. 50 వేల వ్యక్తిగత పూచీకత్తుతో హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది.

2లో

## గత ఏడాదిన్నరలో.. 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం

(మొదటి పేజీ తరువాయి)

న్యూఢిల్లీ: కేంద్రంలోని ఎన్‌డీయే ప్రభుత్వం గత ఏడాదిన్నర కాలంలో 10 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చిందని ప్రధాని మోదీ తెలిపారు. ఇదో రికార్డు అని.. ఇంతవరకు ఏ సర్కారూ ఇన్ని ఉద్యోగాలు ఇచ్చిన దాఖలాల్లేవని చెప్పారు. సోమవారమిక్కడ 'రోజ్‌గార్ మేళా'కు ఆయన వర్చువల్‌గా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో 71 వేల మందికిపైగా నియామక పత్రాలు అందజేశారు. తన ప్రభుత్వ పాలసీలు, కార్యక్రమాలన్నీ యువత కేంద్రకంగానే ఉన్నాయని ప్రధాని చెప్పారు. రోజ్‌గార్ మేళాలతో వారికి సాధికారత లభిస్తోందని.. వారి సామర్థ్యం వెలికివస్తోందని అన్నారు. 'పది లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారిలో అత్యధికులు మహిళలే. అతివలు తమ కాళ్లపై తాము నిలబడేలా చేసేందుకు మా ప్రభుత్వం కృషిచేస్తోంది. 26 వారాలు మాతృత్వ సెలవులివ్వాలన్న నిర్ణయం వారి కెరీర్లకు ఎంతో ఉపకరిస్తోంది. ప్రధాని ఆవాస్ యోజన కింద నిర్మించే ఇళ్లకు వారే యజమానులు. దేశంలో వారి నేతృత్వంలోనే అభివృద్ధి సాగుతోంది. మన యువత శక్తి సామర్థ్యాలను గరిష్ఠంగా వినియోగించుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నాం. వారి కోసమే పలు పథకాలు తెచ్చాం. స్టార్టప్ ఇండియా, డిజిటల్ ఇండియా, అంతరిక్ష, రక్షణ రంగాల్లో సంస్కరణలు ఈ కోవలోవే. యువత అభివృద్ధికి జాతీయ విద్యావిధానం చర్యలు తీసుకుంటోంది. ముఖ్యంగా మాతృభాషల ఉపయోగానికి పెద్దపీట వేస్తోంది' అని వివరించారు. సోమవారం మాజీ ప్రధాని చరణ్‌సింగ్ జయంతిఅని.. దేశ పురోగతికి గ్రామీణ భారతం అభివృద్ధి అని ఆయన గట్టిగా చెప్పేవారని.. దానినే తన ప్రభుత్వం పాటిస్తోందని తెలిపారు. గ్రామాల్లో ఉపాధి అవకాశాలు సృష్టిస్తున్నామని.. స్వయం ఉపాధి కల్పిస్తున్నామని చెప్పారు. ఈ ఏడాది ఆరంభంలో చరణ్‌సింగ్‌కు భారతరత్న ప్రకటించడం తమ అదృష్టమన్నారు. కఠోర శ్రమ, సామర్థ్యం, యువత నాయకత్వంపై దేశాభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. 2047నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తామని తెలిపారు. భారత్ ఇప్పుడు ఐదో పెద్ద ఎకానమీగా ఉందని.. వివిధ రంగాల్లో పరివర్తన దిశగా కదులుతోందని చెప్పారు.

## అందాల దీవిలో కడలి కల్లోలం

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ: సహజసిద్ధ ప్రకృతి అందాలతో కనువిందు చేసే సుందర ద్వీపం చిన్నగొల్లపాలేనికి కష్టం వచ్చింది. దీనిని కడలి ఏటా మింగేస్తోంది. మరికొన్నేళ్లు గడిస్తే దీవి అనవాళ్లు కనబడవేమో అనే బెంగ ఆ గ్రామ వాసులను పీడిస్తోంది. మూడువైపులా ఉప్పుటేర్లు, ఒకవైపు బంగాళాఖాతం ఉండటంతో చుట్టూ నీటితో నిండిన చినగొల్లపాలెం కృష్ణా జిల్లా కృత్తివెన్ను మండలంలో ఉంది. కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాలకు సరిహద్దులో రెండు జిల్లాల సంస్కృతికి అద్దం పడుతూ భౌగోళికంగానే కాక జీవన విధానంలోనూ భిన్న సంస్కృతికి నిలువెత్తు నిదర్శనంగా చినగొల్లపాలెం నిలుస్తోంది. 1962వ సంవత్సరానికి ముందు దీవి మూడువైపులా నీటితో ఒక వైపు భూభాగంతో ద్వీపకల్పంగా ఉండేది. 1962లో కొల్లేరు పరీవాహక ప్రాంత ముంపునీరు సముద్రంలో కలిసేందుకు చినగొల్లపాలెం, పడతడిక గ్రామాల మధ్య కాలువ తవ్వారు. అప్పటి నుంచి ఇది మానవ నిర్మింత దీవిగా మారిపోయింది. నాటినుంచి దాదాపు అర్ధ శతాబ్దంపాటు బాహ్య ప్రపంచంతో రవాణా సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. జల రవాణా మాత్రమే ఉండటంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉప్పుటేరుపై వారధి నిర్మాణం జరిగింది. దీంతో రవాణా సంబంధాలు పునరుద్ధరణకు నోచుకున్నాయి.

## పెట్టుబడులకు రాష్ట్రం అనుకూలం

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో పెట్టుబడుల కోసం తెలంగాణలో అత్యంత అనుకూల వాతావరణం ఉందని ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని మలేషియా పారిశ్రామికవేత్తలను కోరారు. శ్రీధర్‌బాబు గత నెలలో మలేషియా తెలుగు మహాసభలకు హాజరైన సందర్భంగా అక్కడి పారిశ్రామికవేత్తలను రాష్ట్రానికి ఆహ్వానించారు. ఈ మేరకు పలువురు పారిశ్రామికవేత్తలు రాష్ట్ర పర్యటనకు వచ్చారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్ చొరవతో సోమవారం సచివాలయంలో మలేషియా వాణిజ్య ప్రతినిధులతో మంత్రులు శ్రీధర్‌బాబు, తుమ్మల నాగేశ్వర్‌రావు, జూపల్లి కృష్ణారావు, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో సౌర విద్యుత్ రంగం, డ్రైపోర్టుల నిర్మాణం, మురుగు నీటి శుద్ధి ప్లాంట్ల ఏర్పాటు, మహిళా పారిశ్రామికవేత్తలు, అంకుర సంస్థలకు విదేశాల్లో మార్కెటింగ్ సౌకర్యం కల్పించడంపై చర్చించారు.

## దిగంతాలకు సమాంతర సినీమాంత్రికుడు..

(మొదటి పేజీ తరువాయి)

ముంబై/హైదరాబాద్: ప్రముఖ సినీ దర్శకుడు శ్యామ్ బెనెగల్ సోమవారం కన్నుమూశారు. గత కొన్ని రోజులుగా మూత్రపిండాలకు సంబంధించిన వ్యాధితో బాధపడుతున్న 90 సంవత్సరాల శ్యామ్ బెనెగల్ సోమవారం సాయంత్రం ముంబైలోని వోడ్‌హార్డ్ దవాఖానలో తుది శ్వాస విడిచినట్టు ఆయన కుమార్తె పియా బెనెగల్ ధ్రువీకరించారు. ఆయనకు భార్య నీనా బెనెగల్, కుమార్తె ఉన్నారు. అంకుర్, భూమిక, జునూన్, కలియుగ్, ఆరోహన్, త్రికాల్, సుస్మాన్, అంతర్‌నాద్, మండి, మంథన్ తదితర అనేక అవార్డు చిత్రాలకు శ్యామ్ బెనెగల్ దర్శకత్వం వహించారు. 1978లో వాణిశ్రీ, అనంతనాగ్‌లతో ఆయన తీసిన ఏకైక తెలుగు చిత్రం అనుగ్రహం 1979 బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శనకు నోచుకుని విమర్శకుల ప్రశంసలు అందుకుంది. డిసెంబర్ 14న ఆయన మిత్రులు, కుటుంబ సభ్యులతో కలిసి తన 90వ పుట్టినరోజును ఘనంగా జరుపుకున్నారు. 1976లో పద్మశ్రీ అవార్డు, 1991లో పద్మ భూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ఆయనను గౌరవించింది. ఆయన దర్శకత్వం వహించిన విజయవంతమైన చిత్రాలలో మంథన్, జుబేదా, సర్దారీ బేగం కూడా ఉన్నాయి. జవహర్‌లాల్ నెహ్రూ రచించిన డిస్కవరీ ఆఫ్ ఇండియా ఆధారంగా దూరదర్శన్ కోసం ఆయన రూపొందించిన భారత్ ఏక్ ఖోజ్ డాక్యుమెంటరీ దేశవ్యాప్తంగా ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. 1934 డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జన్మించిన శ్యామ్ బెనెగల్ కొంకణీ మాట్లాడే చిత్రపూర్ సారస్వత్ బ్రాహ్మణ కుటుంబానికి చెందినవారు. కర్ణాటకకు చెందిన శ్యామ్ బెనెగల్ తండ్రి శ్రీధర్ బీ బెనెగల్ ఫొటోగ్రాఫర్ కావడంతో కెమెరా పట్ల శ్యామ్‌కు చిన్నప్పటి నుంచే ఆసక్తి ఏర్పడింది. తన 12వ ఏట తన తండ్రి బహుమతిగా ఇచ్చిన కెమెరాతో శ్యామ్ బెనెగల్ తన మొదటి చిత్రాన్ని తీశారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నుంచి ఆర్థిక శాస్త్రంలో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన హైదరాబాద్ ఫిల్మ్ సొసైటీని స్థాపించి తన సినీ ప్రయాణానికి బాటలు వేసుకున్నారు.

# విచారణకు రండి..

(మొదటి పేజీ తరువాయి)

అనంతరం.. ఈ దుర్ఘటనకు ప్రధాన కారణం అల్లు అర్జునేనని అసెంబ్లీ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడంతో.. అదే రోజు సాయంత్రం అల్లు అర్జున్ పత్రికా సమావేశం నిర్వహించి, తనపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని చెప్పిన విషయం విదితమే. అసలు రేవతి మరణం గురించి తనకు మర్నాటిదాకా తెలియదని.. ఆరోజు రాత్రి థియేటర్‌లో పోలీసులు తనవద్దకు రాలేదని బన్నీ చెప్పగా.. థియేటర్ నుంచి ఆరోజు రాత్రి ఆయన్ను తాము దగ్గరుండి బయటకు తీసుకువస్తున్న దృశ్యాలను పోలీసులు మీడియాకు విడుదల చేశారు. ఈ పరిణామాలన్నింటి నేపథ్యంలో.. అల్లు అర్జున్‌ను పోలీసులు విచారణకు పిలవడం గమనార్హం. జరిగిన దుర్ఘటన గురించి మర్నాడు ఉదయం వరకూ తనకు తెలియదని అల్లు అర్జున్ చెప్పిన నేపథ్యంలో.. ఆయన్ను ఎంతసేపు విచారిస్తారు? ఏయేప్రశ్నలు అడిగే అవకాశం ఉందనే అంశం ఆసక్తికరంగా మారింది. కాగా.. ఈ కేసు విషయమై పోలీసులు అల్లు అర్జున్‌ను మంగళవారం ఒక్కరోజే కాక.. రోజూ విచారణకు పిలిచే అవకాశం ఉందని విశ్వసనీయవర్గాల సమాచారం. సంధ్య థియేటర్ దుర్ఘటన నేపథ్యంలో బెనిఫిట్ షోలకు, టికెట్ ధరల పెంపునకు అనుమతి ఇవ్వబోమని సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో దీనిపై ఫిలిం చాంబర్ సోమవారం కీలక సమావేశాన్ని నిర్వహించింది. ఈ సమావేశానికి నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లు హాజరై చర్చించారు. ఇకపై బెనిఫిట్ షోలకు అనుమతులు ఇవ్వబోమని.. టికెట్ రేట్లు పెంచబోమని అంటే ఎలా అని నిర్మాతలు ఆందోళన వ్యక్తం చేశారు. "సినిమాకు అనుకున్న బడ్జెట్‌కు మించి ఖర్చు అయినప్పుడు మాత్రమే టికెట్ రేట్లు పెంచాలని అడుగుతాం తప్ప.. ప్రతి సినిమాకూ అడగం" అని నిర్మాత నాగవంశీ అన్నారు. దీనిపై సీఎంను కలిసే ఆలోచన ఏమైనా ఉందా అని విలేకరులు ప్రశ్నించగా.. ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ప్రస్తుతం అమెరికాలో ఉన్నారని, ఆయన ఇక్కడికి వచ్చాక ముందు ఆయనతో సమావేశమై తదుపరి కార్యాచరణ నిర్ణయిస్తామని నాగవంశీవెల్లడించారు. సినిమా ఇండస్ట్రీ ఆంధ్రప్రదేశ్‌కు తరలిపోదని ఆయన పేర్కొన్నారు. కాగా.. టికెట్ రేట్ల పెంపుపై ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ చైర్మన్ విజేందర్ రెడ్డి ప్రకటించారు. "సినిమా టికెట్ ధరలను పెంచడం వల్ల ప్రేక్షకులు కన్‌ఫ్యూజ్ అతున్నారు. పెరిగిన టికెట్ రేట్లతో మధ్య తరగతి ప్రేక్షకులు, విద్యార్థులు సినిమాలకు రాలేకపోతున్నారు. ఇది కలెక్షన్లపైనా ప్రభావం చూపుతోంది. టిక్కెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం" అని ఆయన చెప్పారు. "తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లే ఏపీ ప్రభుత్వమూ బెనిఫిట్ షోస్, టికెట్ ధరలు పెరగకుండా చర్యలు తీసుకుంటే బాగుంటుంది" అని ఆంధ్రప్రదేశ్ ఎగ్జిబిటర్స్ సెక్టార్ చైర్మన్ ఎస్.రామ్ ప్రసాద్ అన్నారు. "తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి పరిణామం. సినిమాను ఎక్కువ థియేటర్స్‌లో విడుదల చేయడం ఎలా అనే దానిపై నిర్మాతలు దృష్టి పెట్టాలి" అని ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సెక్రటరీ బాలగోవింద్ రాజ్ సూచించారు. టీఎఫ్‌పీసీ చైర్మన్ ప్రతాని రామకృష్ణ గౌడ్ కూడా.. టికెట్ ధరలపై తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు చెప్పారు. ఈ నిర్ణయం వల్ల చిన్న సినిమాలకు మంచి జరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. "పెద్ద సినిమాలకు టిక్కెట్ రేట్లు పెంచడం వల్ల చిన్న చిత్రాలపై భారం పడుతోంది. ఏడాదికి రిలీజయ్యే చిత్రాల్లో చిన్న చిత్రాలే 90 శాతం ఉన్నాయి. కేవలం 10 శాతం మాత్రమే పెద్ద చిత్రాలు ఉంటున్నాయి. చిన్న చిత్రాలకు డిజిటల్ రైట్స్ విషయంలో యూఎఫ్‌వో క్యూబ్ ధరలు అధికంగా ఉన్నాయి. మిగతా రాష్ట్రాల్లో రూ.1500 ఉంటే మన దగ్గర పది వేలు వారానికి వసూలు చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

**నిర్మాతల సాయం..**

సంధ్య థియేటర్ ఘటనలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న శ్రీతేజ్‌ను 'పుష్ప-2' నిర్మాతలు నవీన్ యెర్నేని, రవిశంకర్.. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డితో కలసి పరామర్శించారు. అతడి తండ్రికి రూ.50 లక్షల చెక్కు అందజేశారు. బాలుడికి అందిస్తున్న చికిత్స గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి.. "ఇక ఈ విషయాన్ని రాజకీయం చెయ్యొద్దు. సినీ హీరోల ఇళ్లపై దాడులు చెయ్యొద్దు. శ్రీతేజ్ త్వరగా కోలుకోవాలని దేవుడిని ప్రార్థిస్తున్నా" అన్నారు. సినీ పరిశ్రమ విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందని, పరిశ్రమ ఎక్కడికీ వెళ్లడం లేదని.. వదంతులను ఎవరూ నమ్మొద్దని ఆయన స్పష్టం చేశారు. అల్లు అర్జున్ ఇంటిపై ఓయూ జేఏసీ నేతల దాడిని ఆయన ఖండించారు. దాడులు చేస్తే చట్టం ఊరుకోదని మంత్రి హెచ్చరించారు. కాగా.. తొక్కిసలాటలో గాయపడ్డ శ్రీతేజ్ ఆరోగ్యం నిలకడగా ఉందని.. అతడు క్రమంగా కోలుకుంటున్నాడని, జ్వరం తగ్గుముఖం పడుతోందని కిమ్స్ ఆస్పత్రి వైద్యులు హెల్త్ బులెటిన్ ద్వారా తెలిపారు. కాగా.. జరిగిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్, మంత్రి కోమటి రెడ్డి స్పందించిన తీరు అభినందనీయమని తెలంగాణ రాష్ట్ర ఆర్య, వైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ అన్నారు.

# సంక్రాంతికి వస్తున్నాం!

(మొదటి పేజీ తరువాయి)

ఇటీవలి అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లో చర్చించిన అంశాలతోపాటు మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, కొన్ని కొత్త సంక్షేమ పథకాలు కూడా సంక్రాంతి నుంచి అమల్లోకి రానున్నాయి. మొదటి సంవత్సరం వ్యవసాయ రంగంలో కీలకమైన రుణమాఫీ పథకాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేసిన విషయం తెలిసిందే. నాలుగు విడతల్లో 25.36 లక్షల మంది రైతులకు రూ.20,617 కోట్ల రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. దీంతో పాటు ఏడాదిలో ఒక విడత రైతుబంధు నిధులు కూడా విడుదల చేసింది. కేసీఆర్ ప్రభుత్వం 2023-24 సంవత్సరంలో ఒక పంటకు రైతుబంధు ఇచ్చి, రెండో పంటకు ఎగ్గొట్టిందని, తాము తొలి ఏడాదిలో ఒక పంటకు పాతలెక్క ప్రకారం ఎకరానికి రూ.5 వేల చొప్పున రూ.7,500 కోట్లు రైతుబంధు ఇచ్చామని రేవంత్ సర్కారు వెల్లడించింది. ఇక రైతు భరోసా విధి విధానాలు ఖరారు చేసి రెండో పంటకు ఎకరానికి రూ.7,500 చొప్పున పంపిణీ చేస్తామని ప్రకటించింది.

ఉపసంఘం నివేదిక రాగానే రైతు భరోసా..

రైతు భరోసా పథకాన్ని సంక్రాంతికి అమలు చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తాజాగా ప్రకటించిన విషయం విదితమే! శాసనసభ, శాసనమండలిలో ఇటీవల రైతు భరోసాపై చర్చ కూడా పెట్టారు. దీనిపై ప్రతిపక్ష పార్టీల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఇప్పటికే డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క నేతృత్వంలో ఏర్పాటుచేసిన మంత్రివర్గ ఉపసంఘం కొన్ని జిల్లాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేసింది. అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని.. ఒకటి, రెండు సార్లు ఉపసంఘం భేటీ నిర్వహించి తుది నివేదిక ఇవ్వనుంది. అనంతరం దానిపై రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించి ఆమోదించనున్నారు. మార్గదర్శకాలు ఖరారు చేసి... ఉత్తర్వులు జారీచేయనున్నారు. జనవరి 10 లోగా ఈ ప్రక్రియను పూర్తిచేయనున్నారు. అయితే యాసంగి సీజన్ ఇప్పుడిప్పుడే ప్రారంభమైంది. రైతులు వరి నార్లు పోశారు. అక్కడక్కడ నాట్లు వేస్తున్నారు. ఆరుతడి పంటలు సాగుచేసే రైతులు ఇప్పటికే విత్తనాలు వేశారు. ఈ నేపథ్యంలో విధి విధానాలు ఖరారుచేసి.. యాసంగి సాగు ఊపందుకోకముందే.. రైతుభరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. గతంలో ఎకరానికి రూ. 5 వేలు చెల్లించగా... ఇప్పుడు 50 శాతం పెంచి, ఎకరానికి రూ. 7,500 చొప్పున పంపిణీ చేయనున్నారు. అంటే రెండు పంటలకు కలిపి ఏడాదికి ఎకరానికి రూ.15 వేలు రైతుభరోసా పథకంలో చెల్లిస్తారు. సంక్రాంతి నుంచి ఈ పథకం అమలులోకి వస్తుండటం గమనార్హం.

**యాసంగి నుంచి వ్యవసాయ యాంత్రీకరణ**

కేసీఆర్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి రాగానే... వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని నిలిపివేసింది. 2018 నుంచి 2023 వరకు రైతులకు ఏ పనిముట్లు కూడా సబ్సిడీపై పంపిణీ చేయలేదు. విత్తన సబ్సిడీలను కూడా ఎత్తివేసింది. కేవలం రైతుబంధు, రైతుబీమా పథకాలకే పరిమితమైంది. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ యాసంగి సీజన్ నుంచి వ్యవసాయ యాంత్రీకరణ పథకాన్ని అమలుచేయాలని నిర్ణయించింది. కేంద్రప్రభుత్వ మద్దతుతో యాంత్రీకరణ పథకాన్ని అమలుచేయనుంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) పథకంలో కేంద్ర ప్రభుత్వం 60 శాతం ఆర్థిక సాయం చేస్తోంది. 40 శాతం రాష్ట్ర ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంటు చెల్లిస్తే సరిపోతుంది. ఈమేరకు 2024- 25 ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.26 కోట్లు కేటాయించింది.

## నో డిటెన్షన్ విధానం రద్దు

(మొదటి పేజీ తరువాయి)

ఫలితాలు ప్రకటించిన తేదీ నుంచి రెండు నెలల్లోపు ఫెయిలైన ఆయా విద్యార్థులకు తిరిగి పరీక్షలు నిర్వహిస్తారు. ఆ రీ-ఎగ్జామ్‌లో కూడా విద్యార్థి ఉత్తీర్ణత సాధించకపోతే, తిరిగి అదే తరగతిలో కొనసాగాల్సి ఉంటుంది. ఫెయిల్ కావడంతో తిరిగి అదే తరగతిని మళ్లీ చదువుతున్న విద్యార్థి పట్ల క్లాస్ టీచర్ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలి. ఏయే పాఠ్యాంశాల్లో వెనుకబడి ఉన్నాడో గుర్తించి తగిన సాయం అందించాలి. ప్రాథమికోన్నత విద్య (ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) పూర్తయ్యేంత వరకూ ఏ విద్యార్థినీ ఏ స్కూల్ బహిష్కరించకూడదు.

**ఏయే స్కూల్స్‌పై ప్రభావం?**

'నో డిటెన్షన్' విధానాన్ని రద్దు చేస్తున్నట్టు కేంద్రం ప్రకటించడంతో.. కేంద్ర ప్రభుత్వ పరిధిలోని దాదాపు 3 వేల పాఠశాలల్లో తాజా నిబంధన అమల్లోకి రానున్నది. ఈ జాబితాలో కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ స్కూల్స్, సైనిక్ పాఠశాలలు కూడా ఉన్నాయి.

**రాష్ట్ర ప్రభుత్వాల స్కూల్స్‌లో ఎలా?**

పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం గనుక 'నో-డిటెన్షన్' విధానం రద్దు విషయంలో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. హర్యానా, పుదుచ్చేరి ఈ విషయంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. మిగతా రాష్ట్రాలు మాత్రం 'నో-డిటెన్షన్' విధానానికే మొగ్గు చూపుతున్నట్టు వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల్లో 'నో-డిటెన్షన్' విధానం కొనసాగుతున్నట్టు విద్యా నిపుణులు చెప్తున్నారు. గతంలో ఏ రాష్ట్రాలు రద్దు చేశాయంటే?

విద్యాహక్కుచట్టం-2019కు చేసిన సవరణల ప్రకారం.. దాదాపు 16 రాష్ట్రాలు, ఢిల్లీ సహా రెండు యూటీలు 5, 8వ తరగతులకు ఇప్పటికే 'నో-డిటెన్షన్' విధానాన్ని రద్దు చేశాయి. తాజాగా కేంద్రం కూడా ఈ విధానాన్ని రద్దు చేసింది.

**ఏమిటీ 'నో-డిటెన్షన్' విధానం?**

విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ)-2009 ప్రకారం.. ఒకటి నుంచి 8వ తరగతి వరకూ ఏ విద్యార్థినీ ఫెయిల్ చేయకూడదు. వార్షిక పరీక్షల్లో విద్యార్థి అనుకొన్న ప్రతిభ సాధించనప్పటికీ, పై తరగతులకు ప్రమోట్ చేయాల్సిందే. దీన్నే 'నో-డిటెన్షన్' విధానంగా పిలుస్తారు. అయితే, 2019లో ఆర్టీఈలో చేసిన సవరణల్లో 'నో-డిటెన్షన్' విధానాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే, పాఠశాల విద్య రాష్ట్ర జాబితాలోని అంశం గనుక ఆయా రాష్ట్రప్రభుత్వాలు 'నో-డిటెన్షన్' విధానంపై నచ్చిన విధంగా ముందుకు వెళ్లొచ్చని సూచించారు.

## ఉరికొయ్యలు.. చెరసాలలు!

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్: ఇందిరమ్మ రాజ్యంలో రైతన్నకు ఉరికొయ్యలు, చెరసాలలే మిగిలాయని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ఏడాది పాలనలో ఎక్కడ చూసినా అన్నదాతల ఆక్రందనలే కనిపిస్తున్నాయని సోమవారం ఎక్స్ వేదికగా ఆయన వాపోయారు. ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోవడంతో ఉరితాళ్లతో నిరసన తెలుపుతున్న రైతుల ఫొటోలను జత చేస్తూ ట్వీట్ చేశారు. జాతీయ రైతు దినోత్సవం రోజున ఇలాంటి దుస్థితిని చూడాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. ఆరుగాలం శ్రమించి పంటలు పండిస్తే కొనుగోలు చేయకుండా ప్రభుత్వం అన్నదాతలను అరిగోస పెడుతున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం కోసం అడ్డగోలు హామీలు, అధికారం దక్కిన తర్వాత అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. క్వింటాల్‌కు రూ.500 బోనస్ దేవుడెరుగు.. కనీసం మార్కెట్‌కు వచ్చిన ధాన్యాన్ని కొనే దిక్కు లేదు అని ధ్వజమెత్తారు. 'రుణమాఫీ కాదు.. రైతు భరోసా రాదు.. అప్పులు తెచ్చి తిప్పలు.. కొనుగోళ్లకు పాతర, దళారుల జాతర' అంటూ కాంగ్రెస్ సర్కార్‌పై విమర్శనాస్త్రాలు సంధించారు. తెలంగాణలో ఏ రైతు బిడ్డా ధైర్యం కోల్పోవద్దని, పోరాటాలు మనకు కొత్తేం కాదని, కాంగ్రెస్ కుట్రలపై కలిసికట్టుగా ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. భారతదేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చిన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తెలంగాణలో పుట్టడం మనందరికీ గర్వకారణమని కేటీఆర్ కొనియాడారు. పీవీ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఎక్స్ వేదికగా నివాళులర్పించారు. గడ్డు కాలంలో దేశానికి ప్రధానిగా సేవలందించిన పీవీ, ఆర్థిక సంక్షోభం నుంచి దేశాన్ని కాపాడి తన పాలనతో ఆధునిక భారతానికి బాటలు వేశారని గుర్తుచేశారు. తెలంగాణ వచ్చిన తర్వాత పీవీ నరసింహారావును బీఆర్‌ఎస్ ప్రభుత్వం సముచితంగా గౌరవించిందని వెల్లడించారు. పీవీ శత జయంతి ఉత్సవాలను కేసీఆర్ ప్రభుత్వం ఘనంగా నిర్వహించిందని, నెక్లెస్ రోడ్డుకు పీవీ మార్గ్ అని పేరు పెట్టి విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని, వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరు పెట్టడమే కాకుండా భారతరత్న ఇవ్వాలని కేంద్రానికి తీర్మానం పంపిందని, పీవీ కూతురును ఎమ్మెల్సీగా నియమించి గౌరవించిందని గుర్తుచేశారు. సింగరేణి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సింగరేణి కుటుంబ సభ్యులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

# పేద విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు సంధయ్య మోమోరియల్ ట్రస్ట్ చేసే కృషి అభినందనీయం

## చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి





**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్:** శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని రాయదుర్గం గ్రామం ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరియు ఖాజాగూడ జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ మరియు ఆర్.కే వై ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 10వ తరగతి విద్యార్థిని,విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటిరీయల్ పంపిణీ కార్యక్రమానికి చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్చార్జి సందయ్య మెమోరియల్ ట్రస్ట్ సెక్రటరీ రవికుమార్ యాదవ్ ,గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ముఖ్య అతిథిలుగా హాజరై విద్యార్థిని,విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటిరీయల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ పేద విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెంచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని, పదవ తరగతి విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం సంధయ్య మోమోరియల్ ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయమన్నారు. అనంతరం రవి కుమార్ యాదవ్ మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదవ తరగతి పరీక్షలు అత్యంత కీలకమని, విద్యార్థులకు అన్ని సబ్జెక్టులు కలిపి ఆల్ ఇన్ వన్ గా మరియు మోడల్ ప్రశ్న పత్రాలు సంబంధించిన బుక్లెట్ అందజేయడం వలన పదవ తరగతి పరీక్షలలో విద్యార్థులు ఉన్నతమైన మార్కులు సాధించడానికి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు.కష్టపడి చదివితే రానున్న జీవితంలో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని తెలిపారు. తదంతరం గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి పాఠశాలను అభివృద్ధి పరిచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినప్పుడే మా కృషికి మంచి ఫలితం దక్కినట్టవుతుందన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజ బాబు, రాజశేఖర్,సీనియర్ నాయకులు, స్థానిక నేతలు,ప్రముఖులు, విద్యార్థులు,పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమాలకు పాల్పడుతున్న గ్రామ కార్యదర్శిపై కలెక్టర్ సంగారెడ్డి డిపిఓ కార్యాలయంలో ఫిర్యాదు

## గ్రామ ప్రజలకు తప్పుడు పత్రాలను అందజేత



**డైలీ రిపోర్ట్:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 286 అసైన్ భూముల్లో గత కొన్ని రోజుల కింద లావణ్య ప్రసాద్ రాజ్ మహి కన్స్ట్రక్షన్ వేగం ఇన్ఫ్రా యజమానులకు క్రషర్ నిర్మాణ పనులకు ఏమైనా అనుమతులు ఇచ్చారా అని సమాచార చట్టం కింద పూర్తి వివరాలు అడిగితే మా దృష్టికి ఎటువంటి అనుమతుల కోసం దరఖాస్తు చేసుకోలేదు గ్రామపంచాయతీ కార్యాలయం నుండి ఎటువంటి పర్మిషన్ అనుమతులు ఇవ్వలేదు అని రాతపూర్వకంగా ఇవ్వడం జరిగింది హైకోర్టులో కేసు నడుస్తున్నందున అక్కడ మహి కన్స్ట్రక్షన్ సంస్థకి పంచాయతీ సెక్రెటరీ ఎన్ ఓ సి, ఇచ్చిన కార్యదర్శి పై గ్రామస్తులు తీవ్రంగా మండిపడ్డారు సమయానికి గ్రామపంచాయతీ కార్యాలయానికి రావడం లేదు అలాగే ప్రజల సమస్యలు చెప్పుకుంటే నిర్లక్ష్యం చేస్తూ సమస్య పరిష్కరించకపోవడం ఎక్కువ సమయం క్రషర్ యజమానులతో బ్యాటరీ రీసైక్లింగ్ ఫ్యాక్టరీ యజమానులతో చాటుమాటున పిలుచుకొని డబ్బులు వసూలు చేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న గ్రామ కార్యదర్శి పై గ్రామస్తులందరూ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని జిన్నారం మండలం ఎంపీడీవో కార్యాలయంలో పూర్తి ఆధారాలతో ఫిర్యాదు చేయడం జరిగింది కార్యక్రమంలో రాళ్లకత్వ గ్రామ ప్రజలు ,శ్రీనివాస్, జింక రవీందర్, సాయి గౌడ్ ,తరుణ్ ,ఆది బాల్రాజ్, బయన మహేష,పాల్గొన్నారు.



# రంగారెడ్డి జిల్లా కన్వీనర్‌గా సీమల రమేష్ కురుమ నియామకం

**శేరిలింగంపల్లి, డైలీ రిపోర్ట్:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రంగారెడ్డి జిల్లా కన్వీనర్ గా సీమల రమేష్ కురుమ ను నియమిస్తూ గ్రేటర్ హైదరాబాద్ కార్యాలయంలో సోమవారం నియామక పత్రాన్ని రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ మరియు ప్రధాన కార్యదర్శి పట్ల సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో అందజేశారు. తనపై నమ్మకం ఉంచి తనకు ఈ బాధ్యత ను అప్పగించిన పెద్దలకు ధన్యవాదాలు తెలుపుతూ. వారి నమ్మకం మేరకు పనిచేస్తానని రమేష్ కురుమ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ దయానంద్, సెక్రెటరీ నరసింహ చారి, సికింద్రాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ ఆర్కే భూపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షులు రాంబాబు, మీడియా అధికార ప్రతినిధి తాడూరి గగన్ కుమార్, టి యూ ఎఫ్. టీవీ ప్రతినిధి వెంగళ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ నీటి సరఫరా లో ఇబ్బందులు పరిష్కరించాలని ఫోరమ్ బెట్టర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో వినతి.




**డైలీ రిపోర్ట్:** సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో ని పోతిరెడ్డి పల్లి 11 వార్డ్ 12 వార్డు అనంతరెడ్డి కాలనీ, సాయి రామ్ బాలాజీ కాలనీ రెడ్డి కాలనీ ఓల్డ్ విలేజ్ వీకర్ సెక్షన్ కాలనీ కోట్లపూర్ రోడ్డు తో పాటు సంగారెడ్డి మున్సిపాలిటీలో ని పాలు ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా నీటి సరఫరా లో ఇబ్బందులు రావడం మూలంగా స్థానిక కాలనీ లోని గృహ ల ప్రజలు నీటి కొరకు ఇబ్బందులు పడుతున్నారని వెంటనే మిషన్ భగీరథ నీటి సరఫరా లో ఇబ్బందులు పరిష్కారించి సంగారెడ్డి మున్సిపాలిటీలో ని పోతిరెడ్డి పల్లి లోని 11,12,వార్డులతో పాటు మిగిలిన ప్రాంతాల్లో నీటి ని సరఫరా చేసి ప్రజల కు నీటి కొరత లేకుండా చూడాలని ఫోరమ్ ఫర్ బెట్టర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో మిషన్ భగీరథ పర్యవేక్షక ఇంజినీర్ కార్యాలయం లో మున్సిపల్ కమిషనర్ కార్యాలయం లో వినతిపత్రం ఇచ్చిన ఫోరమ్ ఫర్ బెట్టర్ సంగారెడ్డి అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర సహ కార్యదర్శి గడ్డం పాండు రంగం, కార్యవర్గ సభ్యులు సాయి వరాల పోతిరెడ్డి పల్లి యువకులు శ్రీకాంత్, రమేష్, మల్లేష్ బన్నీ తదితరులు పాల్గొన్నారు.





# డాడీ స్టోర్ రెండో బ్రాంచ్ ప్రారంభం

**గాజుల రామరం/సంగారెడ్డి బ్యూరో డిసెంబర్ 23:** గాజులరామారంలో నవీన్ వర్మ డాడీ స్టోర్ రెండో బ్రాంచ్ ప్రారంభం అయింది . ఈ ప్రారంభించడానికి ముఖ్య అతిథులుగా చిన్న ముదిరాజ్ . రుద్రారం సాయికుమార్ . లవ్ కుమార్. వంశీకృష్ణారెడ్డి . సాయి వర్మ. అరుణ్ యాదవ్. విజయ్. తదితరులు పాల్గొన్నారు ....



## సినీ ఇండస్ట్రీలో విషాదం.. డైరెక్టర్ శ్యామ్ బెనగల్ కన్నుమూత

సినీ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. ప్రముఖ డైరెక్టర్ శ్యామ్ బెనగల్ కన్నుమూశారు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఇవాళ తుదిశ్వాస విడిచారు. ముంబయిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.

**శ్యామ్ బెనగల్ సినీ ప్రస్థానం**

1934 డిసెంబర్ 14న హైదరాబాద్‌లో జన్మించిన ఆయన పలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. ఉస్మానియా వర్సిటీలో ఎంఏ విద్యను అభ్యసించారు. ఆయన దర్శకత్వ ప్రతిభకుగానూ దాదాసాహెబ్ ఫాల్కే పద్మశ్రీ, పద్మభూషణ్ లాంటి సినీ అత్యున్నత అవార్డులు అందుకున్నారు. 1976లో పద్మశ్రీ అవార్డ్ అందుకున్నారు. అంకుర్ (1974) అనే చిత్రం ద్వారా దర్శకుడిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టారు. ఆ తర్వాత నిశాంత్ (1975), మంథన్ (1976), భూమిక, జునూన్ (1978), మండి (1983, త్రికాల్ (1985), అంతర్నాద్ (1991) లాంటి సూపర్ హిట్ చిత్రాలకు దర్శకత్వం వహించారు.

**అనేక అవార్డులు- ప్రశంసలు**

దాదా సాహెబ్ ఫాల్కే అవార్డ్-2005
పద్మశ్రీ -1976
పద్మ భూషణ్-1991
ఇందిరాగాంధీ జాతీయ సమైక్యత పురస్కారం- 2003
ఏఎన్నార్ జాతీయ ?అవార్డ్-2013
నిశాంత్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా జాతీయ చలనచిత్ర అవార్డు -1976
మంథన్ సినిమాకు ఉత్తమ జాతీయ చలనచిత్ర అవార్డు- 1977
జునూన్ చిత్రానికి ఉత్తమ దర్శకుడిగా ఫిల్మ్‌ఫేర్ అవార్డు -1980



## కిర్రాకు లవ్వు పుట్టినట్టు..

ధర్మ, ఐశ్వర్య జంటగా నటిస్తున్న చిత్రం 'డ్రింకర్ సాయి'. 'బ్రాండ్ ఆఫ్ బ్యాడ్ బాయ్స్' ఉపశీర్షిక. కిరణ్ తిరుమలశెట్టి దర్శకుడు. త్వరలో విడుదలకు సిద్ధమవుతున్నది. ఈ సినిమాలోని 'బాగి బాగి..' అనే లిరికల్ సాంగ్‌ను శుక్రవారం విడుదల చేశారు. శ్రీవసంత్ స్వరపరచిన ఈ గీతాన్ని చంద్రబోస్ రచించగా, జావెద్ అలీ ఆలపించారు. 'సర్రంటు కరెంట్ షాక్ కొట్టినట్లు, నరాలు గుర్రాలై దౌడు తీసినట్లు, బుర్రంత గిర్రంటు సుట్టు తిరిగినట్టు..కిర్రాకు లవ్వు పుట్టినట్టు బాగి బాగి సూడరాదే కొంచెం ఆగి..' అంటూ యూత్‌ఫుల్‌గా ఈ పాట సాగింది. యథార్థ సంఘటనల ఆధారంగా ఈ సినిమా తీశామని చిత్ర బృందం పేర్కొంది. పోసాని కృష్ణమురళి, శ్రీకాంత్ అయ్యంగార్, సమీర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: శ్రీవసంత్, రచన-దర్శకత్వం: కిరణ్ తిరుమలశెట్టి.


## 'వికటకవి' ఓ కొత్త అనుభవం



'వికటకవి' వంటి పీరియాడిక్ బ్యాక్‌గ్రౌండ్ సిరీస్‌కు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేయడం ఛాలెంజ్‌గా అనిపించిందని, ఈ సిరీస్ కోసం ఎంతో పరిశోధన చేశానని చెప్పింది గాయత్రి దేవి జోశ్యుల. ఆమె కాస్ట్యూమ్ డిజైనర్‌గా వర్క్ చేసిన 'వికటకవి' డిటెక్టివ్ వెబ్ సిరీస్ ప్రస్తుతం జీ5లో స్ట్రీమింగ్ అవుతున్నది. నరేష్ ఆగస్త్య, మేఘా ఆకాష్ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ సందర్భంగా కాస్ట్యూమ్ డిజైనర్ గాయత్రి దేవి జోశ్యుల మాట్లాడుతూ 'నేను చెన్నైలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేశారు. మైక్రోసాఫ్ట్‌వంటి ప్రముఖ కంపెనీలో పనిచేశా. ఆ తర్వాత ఉద్యోగానికి రాజీనామా చేసి సినీరంగం వైపు అడుగులు వేశాను. 'కుడిఎడమైతే' సిరీస్ ద్వారా కాస్ట్యూమ్ డిజైనర్‌గా నా ప్రయాణం మొదలైంది' అని చెప్పింది.'వికటకవి' సిరీస్ విశేషాల గురించి చెబుతూ 'ఇది తెలంగాణ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కింది. దీనికోసం 1940లో హైదరాబాద్ ఎలా ఉందో రీసెర్చ్ చేసి తెలుసుకున్నా. 'మాభూమి' సినిమా చూడటం వల్ల అప్పటి ప్రజల వేషధారణ, సంస్కృతిపై ఓ అవగాహన వచ్చింది. మరింత రిఫరెన్స్ కోసం లైబ్రరీలకు వెళ్లి ఆర్టికల్స్ చదివాను. ఆ సమాచారం ఆధారంగా కాస్ట్యూమ్ డిజైన్స్ సిద్ధం చేశా' అని పేర్కొంది. 'వికటకవి' టెక్నికల్‌గా తనకు మంచి ఎక్స్‌పీరియన్స్‌నిచ్చిందని, తదుపరి సతీష్ వేగేశ్న దర్శకత్వంలో రూపొందిస్తున్న 'మర్మయోగి' వెబ్‌సిరీస్‌తో పాటు 'మానసచోర' అనే సినిమాకు పనిచేస్తున్నానని గాయత్రి దేవి జోశు ్యల తెలిపింది.

## అర్జున్ మహాక్షయ్ పోరాటం

కన్నడ స్టార్ హీరో కిచ్చా సుదీప్ నటించిన యాక్షన్ థ్రిల్లర్ 'మ్యాక్స్'. వరలక్ష్మి శరత్‌కుమార్, సునీల్ కీలక పాత్రధారులు. విజయ్ కార్తికేయ దర్శకుడు. కలైపులి ఎస్ ధాను నిర్మాత. ఈ చిత్రం తెలుగులో డిసెంబర్ 25న విడుదల కానుంది. అర్జున్ మహాక్షయ్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా ఇందులో సుదీప్ కనిపించనున్నారని, సుదీప్ నట విశ్వరూపాన్ని ఆవిష్కరించే సినిమా ఇదని మేకర్స్ చెబుతున్నారు. సంయుక్త హోర్నడ్, సుకృతి వాగల్, అనిరుద్ భట్ తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: శేఖర్‌చంద్ర, సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, నిర్మాణం: వి.క్రియేషన్స్, కిచ్చా క్రియేషన్స్.





'గంగూభాయ్ కతియావాడీ' తర్వాత సంజయ్‌లీలా బన్సాలీ దర్శకత్వంలో అలియాభట్ చేస్తున్న సినిమా 'లవ్ అండ్ వార్'. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ముంబైలో శరవేగంగా జరుగుతున్నది. అలియా, విక్కీ కౌశల్‌పై కీలక సన్నివేశాలను బన్సాలీ తెరకెక్కిస్తున్నారు. రణబీర్ కపూర్ ఇందులో హీరోగా నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ సినిమా గురించి ఇటీవల అలియా మీడియాతో మాట్లాడింది. 'లవ్ అండ్ వార్' ఓ పిరియాడిక్ డ్రామా.ఓ కొత్త ప్రపంచాన్ని తెరపై ఆవిష్కరించే పనిలో ఉన్నారు సంజయ్‌లీలా బన్సాలీ. ప్రేక్షకుల్ని కొన్ని దశాబ్దాల వెనక్కి తీసుకెళ్లనున్నారాయన. ఆయన దర్శకత్వంలో మళ్లీ నటించడం చాలా ఆనందంగా ఉంది. ఇందులో నా పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది. ఇలాంటి కేరక్టర్‌ని ఎవరూ ఊహించరు. నటిగా నాలోని కొత్తకోణాన్ని 'గంగూభాయ్' ఆవిష్కరించింది. అలాగే ఈ సినిమాలో కూడా కొత్త అలియాను చూస్తారు. 2026 మార్చి 20 వరకూ వెయిట్ చేయండి.' అంటూ చెప్పుకొచ్చింది అలియాభట్.

## ఇలాంటి కేరక్టర్‌ని ఎవరూ ఊహించరు: అలియాభట్

## బాలయ్య 'డాకు మహారాజ్'.. చిన్ని సాంగ్ వచ్చేసింది!



నందమూరి బాలకృష్ణ నటిస్తోన్న తాజా చిత్రం 'డాకు మహారాజ్'. ఈ చిత్రాన్ని బాబీ కొల్లి దర్శకత్వంలో తెరకెక్కిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లో నిర్మిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టైటిల్ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అందులో తమన్ అందించిన బీజీఎమ్ మరో రేంజ్‌లో ఉందంటూ ప్రశంసలు వచ్చాయి. అంతేకాకుండా ఫస్ట్ లిరికల్ సాంగ్‌ను కూడా మేకర్స్ విడుదల చేశారు. తాజాగా ఈ మూవీ నుంచి రెండో సింగిల్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. డాకు మహారాజ్ నుంచి చిన్నీ చిన్నీ అంటూ సాంగే లిరికల్ సాంగ్ విడుదలైంది. ఈ పాటకు అనంత శ్రీరామ్ లిరిక్స్ అందించగా.. విశాల్ మిశ్రా ఆలపించారు. కాగా.. ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు బాబీ డియోల్, ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందిని చౌదరి కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం సంక్రాంతి కానుకగా 2025, జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది. ఈ సినిమాకు ఎస్ఎస్ తమన్ సంగీతమందిస్తున్నారు.

Printed And Published By Bakka Ravinder,on Behalf of Daily Report Publications And broadcasting News, Sangareddy Municipality, Ganesh Nagar HNo 3-11/ Sangareddy District